# 'గాంధీ'కి మెడికల్ సీట్లు ఇవ్వలేం!

## సర్కారుకు ఎంసీఐ స్పష్టీకరణ

- పడకలు, సిబ్బంది, వసతుల లేమే కారణం
- ఎస్వీ, సిద్ధార్థ, అనంత కాలేజీల వివరాలు పంపని అధికారులు
- వైద్య విద్యకు శాపంగా మారుతున్న సర్కారు నిర్లక్ష్య వైఖరి
- సీఎం వద్ద పెండింగ్‌లో వైద్య అధ్యాపకుల పదోన్నతుల ఫైలు




హైదరాబాద్, న్యూస్‌లైన్:

రాష్ట్రానికి ఈ ఏడాది కొత్తగా రావాల్సిన ఎంబీబీఎస్ సీట్లకు సర్కారు నిర్లక్ష్యమే గ్రహణంగా మారింది. రాష్ట్రంలోనే పేరెన్నికగన్న గాంధీ మెడికల్ కాలేజీకి అదనపు మెడికల్ సీట్లు ఇవ్వలేమని రెండు రోజుల కిందటే భారత వైద్య మండలి (ఎంసీఐ) రాష్ట్రానికి తేల్చి చెప్పింది. ఈ వైద్య కళాశాలలో ఔట్ పేషెంట్ల (ఓపీ) సంఖ్య గణనీయంగా తగ్గిందని, అదనపు సీట్లకు కావాల్సినన్ని పడకలు లేవని, సిబ్బంది లేరని, మౌలిక వసతులు లేవని.. ఈ పరిస్థితుల్లో అదనంగా 50 మెడికల్ సీట్లు ఇవ్వలేమని స్పష్టం చేసింది. దీంతో అధికారులకు ఏం చేయాలో పాలుపోవటం లేదు. గాంధీ ఆస్పత్రికే సీట్లు రాలేదంటే మిగతా వైద్య కళాశాలలకు సీట్లు మంజూరు కావటం సాధ్యం కాదని, ఎంసీఐని ఎలాగైనా ఒప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై రెండు రోజుల్లో అధికారుల బృందం ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధమైంది.

**ఎస్వీ, సిద్ధార్థ, అనంతపురం పరిస్థితీ ఇదే!**

తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజ్, అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల, విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. సిబ్బంది సంఖ్య చాలా తక్కువగా ఉండటంతో ఉన్న సీట్లు కూడా పోయే పరిస్థితి నెలకొందని ఎస్వీ, అనంతపురం మెడికల్ కాలేజీల వివరాలను ఇప్పటి వరకూ ఎంసీఐకి పంపలేదు. జనవరి 28న ఎంసీఐకి చేరాల్సిన వివరాలు ఇప్పటికీ చేరలేదు. ఇదిలావుండగా విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌కూ, ప్రభుత్వానికీ మధ్య కొన్ని రోజులుగా వివాదం నడుస్తోంది. దీంతో వైద్య విద్య ఉన్నతాధికారులు ఎక్కువ సంఖ్యలో పడకలు చూపించి సీట్లు తెచ్చుకుందామన్న ఆశలు అడియాసలయ్యాయి. కొత్తగా సీట్లు రావాలంటే 750 పడకలు చూపించాలి. కానీ కళాశాల ప్రిన్సిపల్ 500 పడకలే ఉన్నాయని ఎంసీఐకి నివేదిక పంపించారు. దీంతో ఆ కాలేజీలో ఉన్న సీట్లు కూడా తగ్గిపోయే అవకాశముంది. ఒంగోలు రిమ్స్, నిజామాబాద్ మెడికల్ కళాశాలలకు సంబంధించి కొత్త కాలేజీల నిర్మాణమే పూర్తి కాకపోవటంతో సీట్లు వచ్చే పరిస్థితే లేదని అధికారులే ఘంటాపథంగా చెప్తున్నారు.

**సీఎం వద్దే ఫైలు...**

మెడికల్ కాలేజీలకు కొత్త సీట్లు రావాలన్నా, ఉన్న సీట్లు నిలబడాలన్నా ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు తగినంత మంది ఉండాలనేది ఎంసీఐ నిబంధన. కానీ.. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించకపోవటంతో ప్రొఫెసర్లు, అసోసియేట్‌లు లేరు. దీనికోసం రెండు వారాల కిందట 121 జీవోకు సవరణ చేసి, పదోన్నతులు పూర్తిచేయాలని అధికారులు ఫైలును ముఖ్యమంత్రి వద్దకు పంపారు. కానీ ఫైలు ఇప్పటివరకూ తిరిగి రాలేదు. దీంతో పది బోధనా కాలేజీలు, మూడు రిమ్స్‌లలో ఒక్క పదోన్నతీ జరగలేదు. మరో వారం రోజుల్లో ఎంసీఐ తనిఖీలకు వస్తోంది. పది కాలేజీలకు ఒక్కో కాలేజీకి 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున 500 సీట్లు రావాల్సి ఉండగా, ఉన్నవే తగ్గే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రానికి మెడికల్ సీట్లు రాకపోతే సీఎందే బాధ్యత అంటూ కొన్ని రోజుల కిందట అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డి.ఎల్.రవీంద్రారెడ్డి అన్న మాటలు నిజమయ్యేలా కనిపిస్తున్నాయి!

19-02-2012 - Sakshi